నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం 05 ఏప్రిల్ 2023

రెండవ రోజు పది పరీక్షలు ప్రశాంతం

నవతెలంగాణ-రామారెడ్డి/సదాశివనగర్

మండలంలోని రెడ్డి పెట్, రామారెడ్డి, ఉప్పల్వాయి పదవ తరగతి పరీక్ష కేంద్రాల్లో మంగళవారం రెండవ రోజు ప్రశాంతంగా ముగిశాయి. 473 మంది విద్యార్థులకు, పూర్తి శాతం విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ యోసేప్ తెలిపారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

సదాశివనగర్ : మండలంలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని మంగళవారం జాయింట్ కలెక్టర్ చంద్ర మోహన్ తనిఖీ చేశారు. అడ్లూర్ ఎల్లారెడ్డి, సదాశివనగర్ కేంద్రాలను సందర్శించారు. ఎంఈఓ యూసఫ్ మాట్లాడుతూ రెండో రోజు హిందీ పరీక్షకు అందరూ హాజరైనట్లు తెలిపారు.

జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

కామారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైనా భిక్కనూర్ పట్టణానికి చెందిన అడ్వకేట్ అతిమాముల శ్రీధర్‌ను మార్కెట్ కమిటీ డైరెక్టర్ పురం రాజమౌళి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



శ్రీధర్‌ను సన్మానిస్తున్న పలువురు

చి'వరి'కి నీరేది..?

- చెరువు నిండుకోవడంతో ఎండుతున్న పంటలు
- నిజాంసాగర్ నీటిని విడుదల చేస్తే పంట చేతికొచ్చే అవకాశం

నవతెలంగాణ-మాక్లూర్



నీరందక ఎండిపోయిన పొలాన్ని చూపుతున్న రైతు

వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి కంటికిరెప్పలా పంటను కాపాడుకుంటూ రాగా.. చేతికొచ్చే దశలో సాగునీరు లేక పంట ఎండుముఖం పడుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేపట్టగా పంట చేతకందే దశలో ఎండుముఖం పడుతోందని వాపోతున్నారు. నిజాంసాగర్ కెనాల్ ద్వారా 73వ తూము వరకు రెండు ఫీట్ల మేర నీటిని విడుదల చేస్తే తమ పంటలు చేతికొస్తాయని మాక్లూర్ మండలం మాదాపూర్ రైతులు పాలకులను, అధికారులను కోరుతున్నారు.

భానుడి ప్రతాపంతో భూగర్భ జలాలు క్రమంగా అడుగంటుతున్నాయి. చెరువులు, కుంటలు నీరు లేక ఎండిపోతున్నాయి. బోరు బావులూ వట్టిపోతున్నాయి. దీంతో పంటకు సాగునీరు లేక చివరి దశలో ఎండుతున్నాయి. మాక్లూర్ మండలంలోని మాదాపూర్ గ్రామ శివారులోని పెద్ద చెరువు ఆయకట్టు కింద రైతులు సుమారు 400 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. భానుడి భగభగతో చెరువులో నీరు ఇంకిపోయింది. దీంతో పంట పొలాలకు సాగు నీరు అందక చేతికి వచ్చే దశలో ఎండిపోతు న్నాయి. ప్రస్తుతం సుమారు 100 ఎకరాల వరకు పంట ఎండిపోయిందని, మిగతా విస్తీర్ణం ఎండిపోయే దశలో ఉందని వాపోతున్నారు. ఈ క్రమంలో తమ పంట పొలాలకు నిజాంసాగర్ కెనాల్ ద్వారా 73వ తూము వరకు నీరు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకొని పంట లను కాపాడాలని కోరుతున్నారు. ప్రస్తుతం వస్తున్న కెనాల్ నీరు తక్కువగా రావడంతో సరిపోవడం లేదని రెండు ఫీట్ల నీరు 20 రోజులు వస్తే తమ పంటలు చేతికొస్తా యని రైతులు కోరుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై సోమవారం రైతులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టిన విషయం విధితమే.

కౌలుకు తీసుకున్న.. 6 ఎకరాలు ఎండింది

ముక్కపల్లి సురేష్ యాదవ్, రైతు, మాదాపూర్



నాకున్న 7 ఎకరాలతో పాటు అదనంగా 13 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేశా. మొత్తం 20 ఎకరాల్లో వరి పంట వేస్తే ప్రస్తుతం ఆరు ఎకరాలకు నీరు అందక ఎండిపోయింది. బోరుబావిలో నీరు తగ్గింది. నిజాంసాగర్ కెనాల్ నీటిని విడుదల చేస్తే మిగిలిన పంట చేతికొస్తది. లేకుంటే అప్పుల పాలే.

ఏఎన్ఎం పోస్టుల భర్తీలో అవకతవకలు..?

- కొత్త లిస్ట్‌లో 13 మంది పేర్లు మాయం
- రోస్టర్ విధానం పేరుతో మారిన మెరిట్ లిస్ట్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



ఏఎన్ఎం పోస్టుల భర్తి ప్రక్రియ ఒక అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కు అన్న చందంగా మారింది. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 67 ఏఎన్ఎం పోస్టులను భర్తీ చేసేందుకు 2021వ సంవత్సరంలో నోటిఫికేషన్ జారీ చేయగా.. తాజాగా ఈ నెల 6వ తేదీనా సర్టిఫికేషన్‌ల వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టేందుకు ఉత్తర్వులు జారీ చేయగా.. తాజాగా వాయిదా పడింది. కాగా ఏఎన్ఎంల భర్తీలో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది డిసెంబర్‌లో 31వ తేదీనా మెరిట్ లిస్ట్ విడుదల చేయగా.. తాజాగా ఏప్రిల్ 1వ తేదీనా మరో లిస్ట్‌ను వైద్యాశాఖాధికారులు విడుదల చేశారు. కాగా గతంలో విడుదల చేసిన మెరిట్ లిస్టులో నుంచి 13 మంది పేర్లను తొలగించి కొత్త లిస్టు విడుదల చేయడం పలు అనుమానాలకు తావిస్తోందని బాధితులు ఆరోపిస్తున్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఔట్‌సోర్సింగ్ పద్దతిలో 67 ఏఎన్ఎం పోస్టులను భర్తీ చేసేందుకు 2021 సంవత్సరంలో నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు భర్తీ చేయాలంటూ పలుమార్లు కలెక్టరేట్‌ను ఆశ్రయిం చారు. అయినప్పటికీ గత 2022 డిసెంబర్‌లో ఒక లిస్టుని ఫైనల్ చేసి 64 మంది అభ్యర్థులను రోస్టర్ పద్ధతిలో ఎంపిక చేశారు. ఎంపిక చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా పూర్తయింది. అయితే వారికి ప్లేస్‌మెంట్ ఇవ్వకుండా నిలిపివేశారు. తాజాగా ఏప్రిల్ 1వ తేదీనా మరో మెరిట్ లిస్ట్‌ను విడుదల చేసి వెబ్‌సైట్‌లో పెట్టారు. ఇందులో ఫస్ట్ లిస్టులో వచ్చిన అభ్యర్థులు 13 మంది సెకండ్ లిస్టులో లేకుండా పోయారు. వారు మంగళవారం అదనపు కలెక్టర్‌ను కలిసి గతంలోని ప్రిపేర్ చేసిన లిస్టులో నుంచి తమను ఏవిధంగా తొలగిస్తారని ప్రశ్నించారు. గతంలో విడుదల చేసిన మెరిట్ లిస్ట్ ప్రకారం ప్లేస్‌మెంట్ చూపాలని వినతిపత్రం అందజేశారు. మేకల లింగమణి, బానోత్ సావిత్రి, బానోత్ అనిత, ఎస్ మహేశ్వరి, దుంగవత్ స్వప్న, డి.మౌనిక, శ్యామల, మద్దూరి దివ్య, ఈ.సుమలత, ఆర్.దేవిక, బర్దిపూర్ సౌమ్య, బేగారు స్వరూప, పాల్త జ్యోతి రెండో లిస్ట్‌లో లేవని, తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

సర్టిఫికేషన్‌ల వెరిఫికేషన్ వాయిదా

కాగా రేపు (6వ తేదీన) చేపట్టాల్సి ఉన్న సర్టిఫికేషన్‌ల వెరిఫికేషన్‌ను వాయిదా వేస్తున్నట్టు డీఎంఅండ్‌హెచ్‌వో సుదర్శనం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మొక్కలు ఏపుగా పెంచాలి

- అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే
- నర్సరీ నిర్వహణ తీరుపై ఆగ్రహం



నర్సరీ నిర్వహణపై సూచనలిస్తున్న అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ-తాడ్వాయి

నర్సరీలలో మొక్కలు ఏపుగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులను ఆదేశించారు. తాడ్వాయి మండలం ఎర్ర పహాడ్ గ్రామంలో మంగళవారం నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నర్సరీలలో ఇప్పటికీ మొక్కలు మొలకెత్తలేదని ఎప్పుడు మొలకెత్తుతాయని ఉపాధి అధికారులపై మండిపడ్డారు. జూన్‌లో మొక్కలు నాటే సమయం ఉంటుందని ఇంకా మొక్కలు పెరగపోవడంపై ప్రశ్నించారు. నర్సరీలలో నాణ్యమైన విత్తనాలను వాడాలని సూచించారు. వెంటనే మొక్కలు ఏపుగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు ప్రత్యేకంగా ఆరోగ్య చికిత్సలు నిర్వహిస్తున్న విషయాన్ని పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేకంగా మహిళలకు చికిత్సలు అందిస్తున్న విషయాలు గ్రామాల్లోని అందరి మహిళకు తెలిసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్వీర్, ఉపాధి హామీ సిబ్బంది స్వామి, మహిపాల్ రెడ్డి ,ఉప సర్పంచ్ బాలాజీ క్షేత్ర సహాయకుడు తదితరులు పాల్గొన్నారు

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటోడ్రైవర్‌లతో మాట్లాడుతున్న ఎస్ఐ

నవతెలంగాణ-గాంధారి

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గాంధారి ఎస్ఐ డి సుధాకర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం పోలీస్ స్టేషన్లో గాంధారి మండలంలోని ఆటో డ్రైవర్ల తో సమావేశం నిర్వహించి, కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలను రోడ్లపై ఎక్కడపడితే అక్కడ నిలపొద్దని ప్రతి ఆటోడ్రైవర్ యూనిఫాం తప్పనిసరిగా వేసుకోవాలని ఆదేశించారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఆటో పత్రాలు కలిగి ఉండాలి అని సూచించారు. అనవసరమైన సౌండ్ సిస్టమ్ ఉండకూడదు అని, రాంగ్ రూట్‌లో ఆటోలను నడపొద్దని, ఆటోలలో పరిమితికి మించి ప్యాసింజర్‌లను ఎక్కించుకోవద్దని సూచించారు. ఆటో కు వెనుకవైపు ఓపెన్ చేసి ఉండరాదని ఆటోలను ప్రమాదకరంగా నడపొద్దని, మైనర్‌లకు ఆటోలను ఇవ్వొద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో గాంధారి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రవికుమార్, కానిస్టేబుల్ లు బాలాజీ, నవీన్, గోరి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

నవతెలంగాణ-భిక్కనూర్



రంజాన్ పండుగ సందర్భంగా మండలంలోని మల్లుపల్లి గ్రామంలో మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కుడు మహమ్మద్ షబ్బీర్ అలీ పంపిణీ చేసిన తొమ్మిది రకాల నిత్యావసర సరు కులు, 10 కిలోల బియ్యాన్ని ముస్లిం కుటుం బాలకు ఒక్కొక్కరికి ఎంపీటీసీ మోహన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

శోభాయాత్రకు పటిష్ట నిఘా

- హనుమాన్‌యాత్రలో ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు, డ్రోన్‌లు
- శాంతియుతంగా నిర్వహించుకోవాలి
- రూట్‌మ్యాప్‌ను పరిశీలించిన ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డిటౌన్



శోభయాత్ర జరిగే రూట్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి సీపీ

హన్ మాన్ శోభయాత్ర కోసం దాదాపు నాలుగున్నర కిలోమీటర్ల పరిధిలో అడుగడుగున సిసి కెమెరాలు దాదాపు 600 ఏర్పాటు చేశామని, 1500 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్ కుమార్ తెలిపారు. అన్ని చోట్ల వీడియో-గ్రాఫింగ్ ఏర్పాటు, మూడు డ్రోన్ కెమెరాలు ఏర్పాటు, పటిష్టమైన నిఘా వ్యవస్థ ఏర్పాటుతో, ఎక్కడ ఎలాంటి అవంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. నిజామాబాద్ కమీషనరేటు పరిధిలోని నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, డివిజన్ పరిదిలోని ఈ నెల 6న నిర్వహించే హనుమాన్ శోభాయాత్రను శాంతియుతంగా నిర్వహించాలని ఏసీపీలకు, సీఐలకు, ఎస్ఐలకు సూచించారు. మంగళవారం కమిషనరేట్‌లో వారితో సమీక్షించారు. అనంతరం నిజామాబాద్, బోధన్ డివిజన్‌లో నిర్వహించే హన్మాన్ శోభయాత్ర రూట్ మ్యాప్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు.

శోభాయాత్ర సందర్భంగా ఇతరులకు ఇబ్బం దులు కలుగకుండా ప్రతీ ఒక్కరు అన్ని రకాల జాగ్రత్తలు వహించాలని, శోభాయాత్ర ప్రారంభం నుండి ప్రశాంతంగా సాగేందుకు యాత్ర నిర్వాహకులు, భక్తులు, యాత్రలో పాల్గొనే ప్రజలు నిబంధనల ప్రకారం నడుచుకుంటు పోలీసులకు సహకరించాలని కోరారు. ముందు గైడ్, మధ్య గైడ్, వెనుక గైడ్ ప్రకారంగా ఈ శోభయాత్ర ముందుకు సాగుతుందని, శోభాయాత్ర ప్రారంభం నుండి ప్రశాంతంగా సాగేందుకు యాత్రనిర్వాహకులు, భక్తులు కృషి చేయాలని సూచించారు. ఈ శోభయాత్రలో వాలంటీర్లు కూడా ఉంటారని, ఈ శోభయాత్ర కంఠేశ్వర్ నుండి ప్రారంభమై గోల్‌హనుమాన్ వద్ద పూర్తి అవుతుందని తెలిపారు. ప్రజలు ఎలాంటి రూమర్లను నమ్మవద్దని ప్రతి ఒక్కరు స్నేహాభావంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డి.సి.పి (ఎ.ఆర్) పి. గిరిరాజు, పరిపాలన అధికారి (అడ్మిన్) ఎ.సి.పి జి.మధుసుధర్ రావు, నిజామాబాద్, బోధన్, ఎ.ఆర్ ఎ.సి.పిలు ఎమ్. కిరణ్ కుమార్, కె.ఎమ్. కిరణ్ కుమార్ ఎన్. సంతోష్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, సి.ఐలు ఎస్.ఐలు, ఆర్.ఐలు, ఆర్.ఎస్.ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీ నాయకులతో ఎస్పీ సమావేశం

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కామారెడ్డి పట్టణానికి చెందిన వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. హనుమాన్ జయంతి, రంజాన్ వేడుకల్లో ఎలాంటి ఘటనలు జరగకుండా సహకరించాలని పోలీస్ శాఖ అధికారులు రాజకీయ పార్టీల నేతలకు సూచనలు చేశారు.



వివిధ పార్టీల నాయకులతో, మతపెద్దలతో సమావేశమైన ఎస్పీ

పదోతరగతి పరీక్షల నిర్వహణలో నిర్లక్షమొద్దు

- సెల్‌ఫోన్‌లు తీసుకురానీయొద్దు
- నిర్లక్ష్యంగా వ్యవహరించే శాఖలపై చర్యలు
- కలెక్టర్‌లు, సీపీలతో విద్యాశాఖ మంత్రి వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, పోలీసులు

నవతెలంగాణ-కామారెడ్డి

పదవ తరగతి పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే శాఖలపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, విద్యాశాఖ అధికారులతో పదవ తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. పరీక్షలు జరిగే సమయంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎట్టి పరిస్థితిలో అధికారులు పరీక్ష కేంద్రాల్లోకి సెల్ఫోన్‌లతో వెళ్ళరాదని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ అధికారులు పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిని గుర్తించి ఉద్యోగం నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. రెండు రోజులుగా జరుగుతున్న ఘటనలు భవిష్యత్తులో జరగకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని పేర్కొన్నారు. కామారెడ్డి కలెక్టరేట్ నుంచి జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, రాష్ట్ర పరిశీలకుడు మదన్ మోహన్, జిల్లా పరీక్షల విభాగం అధికారి నీలి లింగం, అధికారులు పాల్గొన్నారు.

కూలీల ఫొటోలు రెండుసార్లు అప్లోడ్ చేయాలి



కూలీలతో మాట్లాడుతున్న పీడీ సాయన్న

నవతెలంగాణ-రామారెడ్డి

ఉపాధి హామీ కూలీల ఫోటోలను క్షేత్ర సహాయకులు ఎన్.ఎం.ఎం.ఎస్ యాప్ ద్వారా పని వద్ద రెండుసార్లు అప్లోడ్ చేయాలని డిఆర్‌డిఏ పిడి సాయన్న సూచించారు. మంగళవారం మండలంలోని గోకుల్‌తండా, మద్దికుంటలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ కూలీలు 5 గంటలు పనిచేయాలని, కొలతల ప్రకారం తప్పకుండా పని చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో విజయ్ కుమార్, ఏపీవో ధర్మారెడ్డి, టి ఏ లు నరసయ్య, జగదీశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు స్రవంతి, ఫీల్డ్ అసిస్టెంట్లు చిన్న స్వామి, పరశురాం, ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.

పొద్దున్నే ఉపాధి పనులు చేసుకోండి

మండలంలోని కన్నాపూర్ తండాలో మంగళవారం ఉపాధి హామీ పనులను సర్పంచ్ చందర్ నాయక్ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున కూలీలు ఉదయాన్నే పనికి వెళ్లాలని సూచించారు. పని వద్ద తాగునీరు, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలని ఉపాధి హామీ క్షేత్ర సహాయకులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చందర్ నాయక్, పంచాయతీ కార్యదర్శి రాములు, ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య, మాన్సింగ్, శ్రీనివాస్, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును వినియోగించుకోండి

డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మణ్ సింగ్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని అర్హులందరూ వినియోగించుకోవాలని కామారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మణ్ సింగ్ సూచించారు. నసురుల్లాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పురం లక్ష్మీ వెంకటరమణతో కలసి పరిశీలించారు. కంటి వెలుగు శిబిరం జరుగుతున్న తీరుపై డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు.

మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరంలో ఇంతవరకు 540 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఇందులో 87 మందికి కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం బీర్కూర్ మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిహెచ్‌సిలో ఉన్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. నిత్యం వచ్చే రోగుల వివరాలు, ఆస్పత్రి సిబ్బంది వివరాల రికార్డులను పరిశీలించారు. ప్రజలకు సౌకర్యంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అందుబాటులో ఉండాలని సమయపాటన పాటించాలని వారిపై తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పురం లక్ష్మి, వెంకటరమణ, డాక్టర్ వైశాలి దయానంద్, ఆరోగ్య కార్యకర్త శిరీష, ఆశా కార్యకర్తలు కంటి వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో

పెట్రోల్‌బంక్‌లో కల్తీ పెట్రోల్ కలకలం

నవతెలంగాణ-రామారెడ్డి



మండల కేంద్రంలోని హెచ్ పి పెట్రోల్ బంక్ లో కల్తీ పెట్రోల్ వచ్చిందని వాహనదారులు మంగళవారం పెట్రోల్ బంక్ ముందు ఆందోళనకు దిగారు. వాహనదారుల వివరాల ప్రకారం... తోకల శేఖర్ తన ద్విచక్ర వాహనంలో పెట్రోల్ పోయించుకోగా, ఎంతకు బండి స్టార్ట్ కాలేదు. దీంతో వాహనాన్ని మెకానిక్ మరమతు చేయగా, పెట్రోల్ ట్యాంక్ లోని, పెట్రోలును బాటిల్లో నింపగా, బాటిల్ కింది భాగంలో నీరు రావడంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో సైతం మూడునాలుగు సార్లు ఇదే తరహా నీరు వచ్చిందని, అయినా అధికారులు చర్యలు తీసుకోలేదని వాహనదారులు ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి, చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

పెట్రోల్ యజమాని రోహిత్ ను నవతెలంగాణ వివరణ కోరగా... పెట్రోల్ బంకులో 24 గంటలు పెట్రోల్ నాణ్యత పరిశీలించుకోవచ్చని, గిట్టని వారు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, పెట్రోల్ బంకులో చమురు నాణ్యత ఉన్నదని, ప్రతిరోజు ఉదయం నాణ్యత పరిశీలించిన తర్వాతనే, వాహనాలకు చమురు అందిస్తున్నామని అన్నారు.

ఘనంగా మహావీర్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో మహావీర్ జయంతి వేడుకలను హనుమాన్ స్వామి భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహావీర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ రాజలింగం, ఎఎంసి వైస్ చైర్మన్ హనుమంత్ రెడ్డి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, హనుమాన్ స్వామి భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు జంబి హనుమాన్ అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఆర్మూర్

అఖిల భారతీయ అయ్యప్ప దీక్ష ప్రచార సమితి అయ్యప్ప సేవ సమితి ఆధ్వర్యంలో నేడు అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రం సందర్భంగా శబరిమల పుణ్య క్షేత్రంలో నిర్వహిస్తున్న అరట్టు మహోత్సవం పురస్కరించు కొని జంబి హనుమాన్ ఆలయ ప్రాగణంలో గల అయ్యప్ప స్వామి మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు అయ్యప్ప దీక్ష ప్రచార సమితి అధ్యక్షులు నోముల అశోక్, ప్రధాన కార్యదర్శి పెంట జలంధర్ ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. నాగేష్ శర్మ గురుస్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమానికి దాతగా పట్టణ వాస్తవ్యులు గాజరెడ్డి నర్సరెడ్డి గురుస్వామి వ్యవహరించనున్నట్టు తెలిపారు. కార్యక్రమములో అయ్యప్ప స్వామి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన అంగన్వాడి ఉద్యోగులు



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రివ్యూ సమావేశం సైతం నిర్వహించారు. కార్యక్రమంలో పిప్రి సెక్టార్ సూపర్వైజర్ వెంకట రమణమ్మ, టీచర్లు శారద, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

మాల్ ప్రాక్టీసింగ్ కేసు నమోదు

- ఇన్విజిలేటర్ సస్పెన్షన్
- 67 మంది గైర్హాజరు



పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న డీఈవో

నవతెలంగాణ-కంఠేశ్వర్

విద్యార్థి తప్పా.. ఇన్విజిలేటర్ తప్పో కానీ విద్యార్థిపై ఒక మాల్ ప్రాక్టీసింగ్ కేసు నమోదు కాగా ఇన్విజిలేటర్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఎస్ఎస్‌సి పబ్లిక్ ఎగ్జామ్స్ ఏప్రిల్ మూడో తేదీన ప్రారంభం కాగా 2 వ రోజు పరీక్షలో సెంటర్ కోడ్ 5029 తెలంగాణ ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ ధర్మారం సెంటర్లో ఓ విద్యార్థి ప్రశ్నాపత్రంపై ఆన్సర్ ఉండడంతో స్క్వాడ్ అధికారులు పరీక్ష రాస్తున్న విద్యార్థిని ప్రశ్నించారు. ఎవరు రాశారో తెలియదు సార్ అని చెప్పాడని తిరిగి ఆన్సర్ రాయాలని స్క్వాడ్ బృందం అడగగా రాయలేక పోయాడని అన్నారు. విధులలో నిర్లక్ష్యం వహించి నందుకు ఉన్నతాధికారులకు సమాచారం అందించి శాఖ పరంగా ఇన్విజిలేటర్‌ను సస్పెన్షన్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ దుర్గాప్రసాద్ మంగళవారం తెలిపారు. రెండవ రోజు పదవ తరగతి పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని, మొత్తం కేంద్రాలు 138, రెగ్యులర్, ప్రైవేట్ కలుపుకొని 21 625 మంది పరీక్ష రాయల్సి ఉండగా 21558 మంది పరీక్ష రాసారని 67 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు. జిల్లా ఎడ్యుకేషనల్ అధికారి ఎస్ దుర్గాప్రసాద్ 9 పరీక్ష కేంద్రాలను తనిఖీలను నిర్వహించగా డిస్టిక్ లెవెల్ అబ్జర్వర్లు ఆరు పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్స్ 44 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేసినట్లు తెలియజేశారు.

అక్రమ మద్యం టెండర్లను నిలిపివేయాలి

ఎక్సైజ్ సిఐకి మెమోరాండం



వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని జరుగుతున్న అక్రమ మద్యం టెండర్లను, బెల్ట్ షాపుల నిర్వహణను అడ్డుకోవాలని ఏర్గట్ల మండల విలేకర్లు ఎక్సైజ్ అధికారికి మోర్తాడ్‌లోని ఆఫీస్ ఎదుట వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల విలేకరులు మాట్లాడుతూ... ఇటీవల గుమ్మిర్యాల్ గ్రామంలో బహిరంగంగా 3.7 లక్షలకు మద్యం టెండర్ జరిగిందని, దీనిపై విచారణ జరపాలని, అక్రమ మద్యం టెండర్లు,బెల్ట్ షాపులను నిలిపివేయాలని ఎక్సైజ్ సిఐ గుండప్పను కోరారు. కార్యక్రమంలో మండల విలేకరులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం అందించండి

విద్యుత్ ఏఈ రమేష్

నవతెలంగాణ-ముప్కాల్

అపరిచిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం అందించండని ముప్కాల్ విద్యుత్ ఏఈ రమేష్ తెలిపారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను రాత్రి వేళల్లో గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేస్తు అందులో ఉన్న ఆయిల్, కాపర్ వైర్లను ఎత్తుకెళ్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి పూట గస్తీ తిరగాలని విజ్ఞప్తి చేశారు. అపరిచిత వ్యక్తులు ఎవరైన ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కనిపిస్తే వెంటనే సమాచారాన్ని అందించాలని పేర్కొన్నారు.

మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-(వేల్పూర్) ఆర్మూర్

మండలంలోని అక్లూర్, మోతే నుండి బడా భీంగల్ వరకు డబుల్ రోడ్డుకు ఆరు కోట్ల 60 లక్షలు మంజూరు చేసిన మంత్రి ప్రశాంత్ రెడ్డి చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధిలో నిర్విరామ కృషి, అభివృద్ధి పనులు జరగడం ఎంతో శుభ సూచకమని అన్నారు. కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ నాయకులు, గ్రామ సర్పంచ్ చంద్రమోహన్, పి ఎ సి ఎస్ చైర్మన్ మోతే రాజేశ్వర్, ఎంపీటీసీ రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనసముందర్ గ్రామంలో ఈనెల 9న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే ఆత్మీయ సమ్మేళనంను విజయవంతం చేయాలని బీర్ఎస్ పార్టీ గ్రామ ఇంచార్జ్, పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్ కోరారు. రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం కోన సముందర్‌లో పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ గ్రామంలోని ఎంఎఫ్‌యు ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ ఆత్మీయ సమ్మేళనానికి కోనాపూర్, నర్సాపూర్, అమీర్ నగర్, ఇనాయత్ నగర్, డిసి తండా, కేసి తండా, మానాల గ్రామంతోపాటు దాని పరిధిలోని తండాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కుటుంబ సభ్యులతో కలిసి హాజరవ్వాలని కోరారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి సర్పంచ్ గడ్డం స్వామి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కాలేరు శేఖర్, బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా మండల కన్వీనర్ బోడ దేవేందర్, నాయకులు ఇంద్రాల రాజు, భలే రావు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ

హనుమాన్ జయంతికి అన్నదానంకోసం



హనుమాన్ స్వాములకు అందజేసిన బియ్యం బస్తాలు

నవతెలంగాణ -నవీపేట్

హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ స్వాములకు అన్నదానంకోసం బోధన్ ఎమ్మెల్యే షకీల్ అమేర్ బియ్యం పంపిణీ చేస్తున్నట్లు ఎంపీపీ సంగెం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలలో 37 క్వింటాళ్ల బియ్యాన్ని అన్ని గ్రామ హనుమాన్ ఆలయాల వద్ద పంపిణీ చేసి మాట్లాడారు. ఎమ్మెల్యే షకీల్ అమేర్ మతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నర్సింగ్ రావు, తెడ్డు పోశెట్టి, గైని సతీష్ మరియు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పదవీకాలం పొడిగింపు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డైరెక్టర్, ఎస్సీ ఎస్టీసెల్‌గా పనిచేస్తున్న డాక్టర్ భ్రమరాంబిక , అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్, డైరెక్టర్, మైనారిటీ సెల్‌గా పని చేస్తున్న గుల్ ఈ రానా, అసోసియేట్ ప్రొఫెసర్ ఇన్ ఉర్దూ, డైరెక్టర్, ఉమెన్ సెల్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ కే అపర్ణ , డిపార్ట్మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ డైరెక్టర్, గ్రీవెన్స్ సెల్ గా పనిచేస్తున్న డాక్టర్ రాజేశ్వరి, అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ వీరి పదవి కాలం ఒక సంవత్సరంపాటు తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ డాక్టర్ డి.రవీందర్ ఆదేశాల మేరకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ విద్యావర్ధిని మంగళవారం ఉత్తర్వులు జారీ చేస్తూ పదవీకాలం పొడిగించారు.

నియామకం...

డాక్టర్ కే ప్రసన్న రాణి అసిస్టెంట్ ప్రొఫెసర్ డిపార్ట్మెంట్ ఆఫ్ లా, డైరెక్టర్ లీగల్ సెల్‌గా, డాక్టర్. బి. స్రవంతి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్‌లా, డైరెక్టర్, లీగల్ ఎయిడ్ క్లినిక్‌గా నియమిస్తూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ విద్యావర్ధిని మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ- మాక్లూర్

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పూర్ భూమయ్య , దేశెట్టి సాయిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని బోర్గం గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాసంగి పంటలు కోతకు వచ్చాయని, కొనుగోలు కేంద్రాలు ముందుగానే ఏర్పాటు చేయాలని, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు సేద తీర్చుకోవడానికి టెంట్లు, మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధరల కోసం ఎంఎస్పి మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని చట్టసభల్లో చట్టాన్ని తీసుకురావాలని కోరారు. అలాగే చేతికొచ్చిన పంటలకు నీళ్ల లేక ఎండిపోతున్నయని అన్నారు. మండలంలోని మాదాపూర్ గ్రామ శివారులోని సుమారు 400ఎకరాల భూమి నీర లేక ఎండిపోతుందన్నారు. కావున ప్రభుత్వం, అధికార యంత్రాంగం చొరవ చూపి నిజాంసాగర్ నుండి తక్షణమే నీటిని విడుదల చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బోధన్ పట్టణంలో రూట్‌మ్యాప్ పరిశీలన

నవతెలంగాణ -బోధన్

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం బోధన్ పట్టణంలో జరిగే హనుమాన్ స్వాముల శోభాయాత్ర సందర్భంగా పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మంగళవారం నిర్మల్ ఎస్పీ, జిల్లా ఇంచార్జి పోలీస్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ పట్టణంలో పర్యటించి రూట్ మ్యాప్ పరిశీలించారు. హనుమాన్ స్వాములు నిర్దేశించిన మార్గంలో జరిగే శోభాయాత్రపై స్థానిక పోలీసు అధికారులను అడిగి వివరాలు సేకరించారు. పాత బస్టాండ్ హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమయ్యే శోభాయాత్ర ప్రధాన వీధుల గుండా వెళ్లే మార్గాన్ని ఆయన పరిశీలించారు. హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు చేపట్టాలన్నారు. అవసరమైన ఏర్పాట్లు చేయా లన్నారు. ప్రజలు శాంతి యుతంగా పండగలను జరుపుకోవాలని కోరారు. ఆయన వెంట ఏసీపీ కిరణ్ కుమార్, పట్టణ సీఐ ప్రేమ్ కుమార్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి సీపీ ప్రవీణ్‌కుమార్

ఏఎన్ఎమ్ సెలక్షన్ లిస్టుల అవకతవకలపై విచారణ చేపట్టాలి

పీడీఎస్‌యూ వినతి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఏఎన్ఎం సెలక్షన్ లిస్టులో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, డిఎంహెచ్ఓ కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్ మాట్లాడుతూ ఏఎన్ఎం నోటిఫికేషన్‌లో చాలామంది అప్లై చేసుకున్నారన్నారు. వారిలో 64 మందిని మొదటి లిస్టులో సెలెక్ట్ చేశారని తెలిపారు. మొదటి లిస్టులో సెలెక్ట్ అయిన వారికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ అయిందని, మరో వారం రోజుల్లో మీకు ఆర్డర్స్ వస్తాయని అన్నారు కానీ మొదటి లిస్టులో 64 మందిని కాకుండా మరలా రెండో లిస్టులో 67మంది వేరే వ్యక్తులను సెలక్షన్ చేసి ఇచ్చారని తెలిపారు. ఎందుకంటే మొదటి లిస్టు ఫైనల్ అని చెప్పిన తర్వాత మరలా రెండో లిస్టు ఫైనల్ అని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. కలెక్టర్, డిఎంహెచ్‌కు అధికారులకు బాధితులు విన్నవిస్తే మరలా ఇంకొక లిస్టు పెడతామని ఈ లిస్టు ఫైనల్ కాదని తెలిపారన్నారు. అవినీతికి అధికారులే ఎర్ర తివాచిపరిచారని అన్నారు. వెంటనే అర్హులైన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మొదటి లిస్టులో పేర్లు వచ్చిన వారు, పీడీఎస్‌యూ నగర అధ్యక్షులు అశుర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

క్రీడాకారులకు సహాయ సహకారాలు అందజేస్తా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈనెల 2న డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి గురుకుల పాఠశాలలో జరిగిన మినీ సబ్ జూనియర్ జిల్లా సాఫ్ట్ బాల్ టోర్నమెంట్లో మిట్టపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాల్గొని ద్వితీయస్థానంలో విజయం సాధించారు. గురుకుల పాఠశాల వేల్పూర్ జట్టుపై 10-02 పరుగుల తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు చేరి ఫైనల్‌లో గురుకుల పాఠశాల ఆర్మూర్ జట్టుతో 3 ఇన్నింగుల్లో సాగిన మ్యాచ్లో 05-06 పరుగుల తేడాతో ఓటమి చెంది ద్వితీయ స్థానం పొంది ట్రోఫీ, రజిత పథకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులను, ఇందుకు కృషిచేసిన వ్యాయామ ఉపాధ్యాయులు మర్కంటి గంగా మోహన్‌ను సర్పంచ్ తెలు గణేష్, ఎంపీటీసీ బాలగంగాధర్, మిట్టపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు యాళ్లగడ్డ రాఘవేంద్రరావు, పాఠశాల చైర్మన్ భాస్కర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజేత, బీఆర్ఎస్ నాయకులు ఒడ్డం నర్సయ్య, గోపు రాజేశ్వర్, ఎస్.కె జుబేర్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, మమత, రమాదేవి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తెలు గణేష్ మాట్లాడుతూ హైస్కూల్ విద్యార్థులే కాకుండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు కూడా జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ మిట్టపల్లి క్రీడాకారులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తనవంతు సహాయంగా సాఫ్ట్ బాల్ క్రీడాకారులకు క్రీడా పరికరాలను అందజేస్తానన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న సర్పంచ్ గణేష్

కంటి వెలుగును వినియోగించుకోవాలి

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మాందాపూర్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ రంపె సులోచనా గంగాధర్ మంగళవారం ప్రారంభించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన శిబిరాన్ని ప్రారంభించిన ఆమె కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఆహారంలో పోషకాల లోపం కారణంగా వయసుతో సంబంధం లేకుండా అందరిలో కంటి సమస్యలు వస్తున్నాయన్నారు. టీవీలు, సెల్ ఫోన్ల బారిన పడి చాలామంది కండ్లకు సంబంధించిన రోగాల బారిన పడుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.రత్నకుమారి, టీఆర్ఎస్ నాయకుడు రంపె గంగాధర్, శిబిరం సమన్వయకర్త సుధాకర్, కంటి వైద్యుడు శ్రీరాం యాదవ్, ఆప్తమాలజిస్ట్ రాజేశ్వరి, శిబిరం సిబ్బంది సమంత, ఏఎన్ ఎంలు అరుణ, సువర్ణ, వార్డు మెంబర్ గోపు జ్యోతి, ఆశ కార్యకర్తలు రోజా, ప్రవీణ, సునీత, గంగామణి, అంగన్వాడీ టీచర్ సత్యగంగ తదితరులు పాల్గొ



కంటిపరీక్షలు చేస్తున్న వైద్యులు

బెల్లాల్ గ్రామంలో కంటి వెలుగు ప్రారంభం



కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌ఛార్జి సర్పంచ్ రాజు

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని బెల్లాల్ గ్రామంలో మంగళవారం ఇంచార్జి సర్పంచ్ రాజు కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన కంటి వెలుగులో ప్రజలు కంటి పరీక్షలు చేసుకుని, ఉచితంగా అందించే కంటి అద్దాలను గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజు, వార్డ్ మెంబర్ లలిత, సెక్రటరీ సురేష్ గౌడ్, గ్రామ పెద్దలు బుర్రి లక్ష్మణ్, సమ్మయ్య, నీలకంఠం గౌడ్, ఏఎన్ఎం సంధ్యారాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే కృషి అభినందనీయం



ఎమ్మెల్యేను కలిసిన కౌన్సిలర్, తదితరులు

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గ అభివృద్ధిలో స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, పీయూసి చైర్మన్ ఆశన్నగారి జీవన్ రెడ్డి కృషి అభినందనీయమని ఏడవ వార్డు కౌన్సిలర్ ఇట్టెడి నర్సారెడ్డి అన్నారు. మంగళవారం అంకాపూర్ గ్రామంలో మర్యాద పూర్వకంగా కలిసి పలు అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో జిజిరామ్ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో 9 మంది గైర్హాజరు

నవతెలంగాణ-బోధన్

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో బోధన్ మండలంలో మంగళవారం 9 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఎంఈఓ నాగనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్ ఉమ్మడి మండలంలో 13 సెంటర్లలో జరిగిన హిందీ పరీక్షలో 2759 మంది విద్యార్థులకు గాను 2750 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిది పేదలకు వరం

నవతెలంగాణ-సిరికొండ

ముఖ్యమంత్రి సహాయనిది పేదలకు గొప్ప వరమని జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పిటిసి బాజిరెడ్డి జగన్ అన్నారు. మంగళవారం ఆయన రూరల్ ఎమ్మెల్యే, టీఎస్ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో మండల కేంద్రానికి చెందిన పారిపెళ్లి సుశీలకు 48వేలు, రాందాస్ హుస్సేన్ నగర్ 18వేల రూపాయల చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వైద్యం చేయించుకోవడానికి డబ్బులు లేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిది నుండి డబ్బులు అందించి గొప్ప కార్యక్రమం తెలంగాణలో ముఖ్యమంత్రి చేస్తున్నారని వారికి సదా కృతజ్ఞులుగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జాగృతి రూరల్ జిల్లా కన్వీనర్ మల్లెల సాయి చరణ్ ,లబ్దిదారులు పాల్గొన్నారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు

నవతెలంగాణ-మెండోర



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా మహిళలకు సంబందించి అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిపియంఐబి శ్రీనివాస్ హాజరయ్యారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ప్రణవ, మహిళ సమాఖ్య సిసి, వీవోఏలకు ఆయన మొబిలైజేషన్ పై సూచనలిస్తూ పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐకెపి ఎపియం విక్రమ్ రెడ్డి , సిసి సాయన్న, హెల్త్ స్టాఫ్ సిబ్బంది, ఐకెపి సిబ్బంది గ్రామ సంఘం అధ్యక్షురాలు, మహిళ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పండుగలను కలిసిమెలసి చేసుకోవాలి



నవతెలంగాణ-జుక్కల్

పండుగలను కులమతాలకతీతంగా శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ మురళి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో యువజన సంఘాలు, గ్రామ పెద్దలతో కలిసి పోలీసు శాఖ ఆధ్వర్యంలో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మురళి మాట్లాడుతూ రాబోయే రోజులలో పండుగల సీజన్ ఉందని, హనుమాన్ జయంతి, రంజాన్ పండుగలను దృష్టిలో పెట్టుకుని పండుగలను శాంతీయుతంగా నిర్వహించు కుంటూ ఒకరికినొకరు సహకరించుకోవాలని, పుకార్లను నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో యువజన సంఘాల నాయకులు, ముస్లిం పెద్దలు, స్థానిక సర్పంచ్ బొంపెలి రాములు, కాంగ్రెస్ నాయకుడు దాదారావ్, బీఆర్ఎస్ నాయకులు సాయాగౌడ్, నీలుపటేల్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అత్యవసర సమయంలో ప్లేట్లెట్స్ దానం చేసిన యువకుడు



నవతెలంగాణ-భిక్కనూర్

అత్యవసర సమయంలో భిక్కనూర్ పట్టణ కేంద్రంలో శివారులో టోల్ ప్లాజా లో పనిచేస్తున్న బాబు అనే యువకుడు ప్లేట్లెట్స్ దానం చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడారు. కామారెడ్డి పట్టణంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రాముడు అనే వ్యక్తికి ప్లేట్లెట్స్ తగ్గడంతో జిల్లా రక్తదాతల సేవా సమితి సభ్యులు దాతలకు సమాచారం అందించారు. రక్తదాతల సేవ సమితి ద్వారా విషయం తెలుసుకున్న బాబు ప్లేట్లెట్స్ దానం చేసి రాములు ప్రాణాలు కాపాడారు. సరైన సమయంలో ప్లేట్లెట్స్ దానం చేసి రాములు ప్రాణాలు కాపాడిన బాబుకు, రక్తదాతల సేవా సమితి సభ్యులు అరుణ్, శివకుమార్, నర్సా గౌడ్, బాలు, పోచయ్య, భాస్కర్ పటేల్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు

చలివేంద్రం ప్రారంభం



లింగంపేట్ మండలం పోల్కంపేట్‌లో చలివేంద్రాన్ని ప్రారంభం

నవతెలంగాణ-లింగంపేట్/దోమకొండ

లింగంపేట్ మండలంలోని పోల్కంపేట్ గ్రామంలో మంగళవారం చలివేంద్రం ప్రారంభించినట్లు సర్పంచ్ పద్మనాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల మరణించిన ఇంజినీరింగ్ విద్యార్థి మర్రి రుత్విక్ జ్ఞాపకార్థం ప్రారంభించామని అన్నారు. అనంతరం చలివేంద్రం ఏర్పాటుకు సహకరించి రుత్విక్ తండ్రి మర్రి మల్లేశం ను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రమేష్, సొసైటీ డైరెక్టర్ సత్యనారాయణ, గ్రామకార్యదర్శి అశ్వక్, వార్డు సభ్యులు సాయిలు,సంతోష్, అమృతరాజు, సావిత్రి శ్రీరాములు, రాజమని సాయిలు, విఆర్ఏ కిష్టయ్య, యువకులు శ్రీకాంత్, నవీన్ గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ : దోమకొండ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు సమీపంలో ఛత్రపతి శివాజీ సేవా దళ్ ఆధ్వర్యంలో చలి వేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజల కోసం ఆయా సేవా కార్యక్రమలు చేపట్టున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ సేవా దళ్ సభ్యులు నల్లపు శ్రీనివాస్, గజవాడ శ్రీకాంత్, బొమ్మర శ్రీనివాస్, బుర్రి రవి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎంపీ

నవతెలంగాణ-జుక్కల్

జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ చేతుల మీదుగా మంగళవారం పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసినట్టు నాగల్‌గావ్ గ్రామ సర్పంచ్ కపిల్ పటేల్ తెలిపారు. సర్పంచ్ కపిల్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన సుభాష్‌కు 38 వేల రూపాయలు, శాంతాబాయికి రూ.30 వేల చెక్కు ఎంపీ కృషితో మంజూరైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా లబ్దిదారులు ఎంపీ బీబీపాటిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాలాజీ పటేల్, లబ్దిదారులు సుభాష్, శాంతాబాయి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వెండి వితరణ



వెండిని అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రం లోని వన దుర్గ పెద్దమ్మతల్లి విగ్రహానికి ముదిరాజ్ సంఘము అధ్యక్షులు పున్న లక్ష్మన్ ఆధ్వర్యంలో దోమకొండ గ్రామానికి చెందిన బుర్రివిజయ లింగం అమ్మవారి చేతి తొడుగులకు 150 తులాల వెండిని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పున్న లక్ష్మన్ మాట్లాడుతూ పెద్దమ్మ ఆలయం అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. వెండిని వితరణ చేసిన దాతకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు కమిండ్ల నర్సింలు, బోయిని సత్యం, డైరెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

కొడుకు మృతిని తట్టుకోలేక..

తల్లి ఆత్మహత్య

నవతెలంగాణ-సదాశివనగర్

కొడుకు మృతిని తట్టుకోలేక తీవ్ర మనోవేదనకు గురై తల్లి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని పద్మాజీవాడి గ్రామంలో చోటుచేసుకుంది. మంగళవారం కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల సత్యవ్వ (69) కొడుకు సంవత్సరం క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి మనస్తాపానికి గురైన ఆమె.. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె మనమడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

సెల్ ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించొద్దు

- పరీక్షా కేంద్రాల చుట్టూ గట్టి పోలీసు బందోబస్తు

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ

పదవ తరగతి వార్షిక పరీక్షలను కట్టుదిట్టమైన ఏర్పాట్లతో మరింత పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్‌లను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించొద్దని ఆదేశాలు జారీ చేశారు. పదవ తరగతి పరీక్షల నిర్వహణ తీరుతెన్నులపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో మంత్రి సబితా ఇంద్రారెడ్డి శనివారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎస్సెస్సీ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు గడిచిన పక్షం రోజులకు పైగా పెద్ద ఎత్తున కసరత్తులు చేస్తూ అనేక జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. అన్ని శాఖలను కలుపుకొని సుమారు 55,000 మంది ఉద్యోగులు పరీక్షల నిర్వహణ విధుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. అయినప్పటికీ ఒకరిద్దరి నిర్లక్ష్య వైఖరి వల్ల సోమ, మంగళ వారాల్లో అక్కడక్కడ చోటు చేసుకున్న సంఘటనలు ఎంతో బాధ కలిగించాయన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీలు జరగనప్పటికీ, దీనిని రాజకీయంగా మల్చుకునేందుకు కొంతమంది ప్రశ్నాపత్రాల లీకేజీలు జరిగినట్లు మాట్లాడుతున్నారని, ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని మంత్రి ఆవేదన వెలిబుచ్చారు. దీనివల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురి కావాల్సి వస్తోందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని, మిగిలిన పరీక్షలను మరింత కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ పక్కాగా నిర్వహించేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు.

నిరుద్యోగుల జీవితాలతో ఆటలు

- ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా



నినదాలు చేస్తున్న నాయకులు, నిరుద్యోగులు

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నాపత్రాల లీకేజీ పై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, మంత్రివర్గం నుండి కేటీఆర్ ను తొలగించాలని, కమిషన్ పాలక మండలిని రద్దు చేయాలనే డిమాండ్లతో గత పది రోజులుగా ఎన్ ఎస్ యు ఐ మరియు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేస్తుంటే మరోవైపు మదమెక్కిన బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఎన్ఎస్‌యుఐ, యువజన కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించి దోషులను తప్పించే ప్రయత్నం చేస్తోందని నాయకులు ఆరోపించారు. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ దుచ్చర్యను నిరసిస్తూ.. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులతో కలిసి కోర్టు రోడ్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చందు, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు ఐరేని సందీప్ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ మొత్తం అవినీతిలో కూరుకుపోయిందని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును వందలాది కోట్ల రూపాయలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అమ్ముకొని లక్షలాదిమంది నిరుద్యోగుల పొట్టగొట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీ పై తగు సాక్షాదారాలతో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన రేవంత్‌రెడ్డికి సిట్ నోటీసులు పంపిందని, రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షలకు పైగా నిరుద్యోగుల పక్షాన ఆందోళనలు చేస్తున్న ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించి ఉద్యమాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులతో ఉద్యమాలను ఆపలేరని స్పష్టంచేశారు. ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులకు కాంగ్రెస్ పార్టీ భయపడబోదని, నిరుద్యోగుల పక్షాన నిలబడి టిఎస్‌పిఎస్సి ప్రశ్నాపత్రాల లీకేజీ పై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టేంతవరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా నిరుద్యోగులకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు ఐరేని సందీప్ యువజన కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్, ప్రవీణ్, భుఖ్యా రాజు, తుడుం జీవన్ సోఫియాన్, శ్రీధర్, నందుతో పాటు దాదాపు 300లకు పైగా నిరుద్యోగులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులకు బ్యాంకు లోన్ ఇప్పించాలి



ఎన్నికైన కమిటీ

నవతెలంగాణ-లింగంపేట్

నాయీ బ్రాహ్మణులకు బ్యాంకు నుండి వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని జనశక్తి నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు వికాస్ నాయనా అన్నారు. లింగంపేట్ మండలం జనశక్తి నాయి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. కమిటీ సమావేశానికి జనశక్తి నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వికాస్ నాయి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నందు నాయి, జిల్లా అధ్యక్షులు మహేందర్ నాయి, గౌరవ అధ్యక్షులు ఎల్లన్న నాయి, ఉపాధ్యక్షులు బాలకిషన్ నాయి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్ర,జిల్లా, కమిటీ నాయకులకు శాలువాలతో సన్మానించిన లింగంపేట్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు, రాష్ట్ర అధ్యక్షుడు వికాస్ నాయి సభా ముఖంగా మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ అనంతరం నాయి బ్రాహ్మణులకు రక్షణ లేకుండా పోయిందని కులవృత్తి పనులలో కార్పొరేటర్లు బిజినెస్‌గా మార్చారని అన్నారు. నాయి బ్రాహ్మణులకు ఉచిత కరెంటు ఒకటే కాదు, ప్రభుత్వం తరపున రుణ సదుపాయాలు కల్పించాలని, పింఛన్ వ్యవస్థను అమలు పరచాలని అన్నారు.

మండల కమిటీ ఎన్నిక

లింగంపేట్ మండల జనశక్తి నాయి బ్రాహ్మణ సేవా సంఘం మండల అధ్యక్షులుగా చంద్రయ్య నాయి, కార్యదర్శిగా స్వామినాయి, గౌరవ అధ్యక్షులుగా అంజయ్య నాయి, మండల ఉపాధ్యక్షులుగా సురేష్ నాయి, ఆంజనేయులు నాయి, రాజు నాయి, కిరణ్ నాయి,సంయుక్త కార్యదర్శులుగా సంజీవులు నాయి, రవి నాయి, రాజు నాయి, తదితరులను మండల కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్టు జిల్లా కార్యదర్శి రవీందర్ నాయి తెలిపారు.

ప్రతి గడపకు బీఆర్ఎస్ పథకాలు



మాట్లాడుతున్న పెర్క శ్రీనివాస్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

గడపగడపకు బిఆర్ఎస్ సంక్షేమ పథకాలు చేరేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పార్టీ నసురుల్లాబాద్ మండలం అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండలం మిర్జాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన టిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామ ప్రజాప్రతినిధులతో, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు పెరిక శ్రీనివాస్ మాట్లాడుతూ మిర్జాపూర్ గ్రామాభివృద్ధికి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ఎనలేని కృషి చేశారని ఆయన అన్నారు. గ్రామ ప్రజా ప్రతినిధులు అడిగిన ప్రతి పనికి వెంటనే నిధులు మంజూరు చేసి ఆ పనులు జరిగేలా చూశారని అన్నారు. స్పీకర్ కృషితోనే గ్రామాభివృద్ధి జరిగి నాలుగు సార్లు మండలంలో ఉత్తమ గ్రామపంచాయతీ గాను రెండుసార్లు జిల్లా ఉత్తమ గ్రామపంచాయతీ గాను, ఈ సంవత్సరం రాష్ట్ర ఉత్తమ గ్రామ పంచాయతీగా మీర్జాపూర్ ఎంపిక అయిందన్నారు. ప్రతి ఇంటికి ఏదో ఒక పథకంతో ఎంతోకొంత బిఆర్ఎస్ పార్టీ సంక్షేమ పథకాలు వాళ్ళింటికి చేరినాయని. ఈ మధ్య పని పాట లేని వారు కొందరు గ్రామానికి వచ్చి లేనిపోని సమస్యలు సృష్టిస్తారని అలాంటి వారి మాటలను నమ్మకుండా పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు. ఏ ఒక్కరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంతో పాటు కార్యకర్తలకు అండగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ నెంబర్ మజీద్, సొసైటీ అధ్యక్షుడు మారుతి, గ్రామ సర్పంచ్ పురం లక్ష్మివెంకటరమణ, ఎంపీటీసీ రమాదేవి కృష్ణ, అంకోల్ క్యాంప్ సర్పంచ్ రాము సీనియర్ నాయకులు ప్రతాప్ సింగ్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-రాజంపేట్

అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని, తప్పుపడ్డ రైతుల పాస్ పుస్తకాలు సరియేసి ఇవ్వాలని, సాగు చేసుకుంటున్న రైతులకు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సిపిఐ జిల్లా కార్యదర్శి.ఎల్. దశరథ్ మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు రైతులకు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని తప్పు పడ్డ వివరాలను సరి చేసి ఇవ్వాలని, అదేవిధంగా అర్హులందరికీ 9 సంవత్సరాలు అవుతున్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లు లేక పేద ప్రజలు అనేక ఇబ్బందుల గురవుతున్నారని పేదలకు వెంటనే డబల్ బెడ్ రూమ్ నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖాళీ స్థలం ఉన్న నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు ఇవ్వాలని, ప్రతి ఒక్క అర్హులకు ఆసరా పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి బాలరాజ్, మండల కార్యదర్శి బత్తుల ఈశ్వర్, గ్రామ కార్యదర్శి హనుమాన్లు, సాయిలు, శ్యామల నాగరాజు, శ్రీను, బాలయ్య, పెంటయ్య సాయవ్వ నాగమణి, రాజవ్వ, లావణ్య ,సాయవ్వ ,మంగలి రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు



వీడ్కోలులో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండలంలోని సజ్జనపల్లి గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్ మాట్లాడుతూ వీడ్కోలు అనేది ఒకే సందర్భంలో ఆనందం, దుఃఖం కలయిక అన్నారు. చిన్నప్పటి నుంచి చదువుకున్న బడిని వీడుతున్నామనే బాధ, పై తరగతులకు వెళ్తామనే సంతోషం రెండూ ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా నైతిక విలువలతో కూడిన క్రమశిక్షణను అలవర్చుకొని, ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. 8వ తరగతి విద్యార్థులు పాఠశాల, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థుల పట్ల తమకున్న అనుభూతులను పంచుకొని కన్నీటిపర్యంతమైయ్యారు. 7వ తరగతి విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దామోదర్, ఉపాధ్యాయులు పద్మ, బన్సీ, కవిత, జాకిర్, సంగమేశ్వర్ విద్యార్థులు పాల్గొన్నారు.

మద్నూర్ టూ సికింద్రాబాద్‌కు బస్సు

- హర్షం వ్యక్తం చేస్తున్న మండల వాసులు



బస్సుకు పూజలు చేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ నుంచి సికింద్రాబాద్(జేబీఎస్)కు బస్ సర్వీసును బోధన్ డిపో నుంచి ప్రారంభించారు. దీంతో మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు మద్నూర్ నుంచి స్టార్ట్ కానుంది. తిరిగి తర్వాత రోజు తెల్లవారు జాము 4 గంటలకు సికింద్రాబాద్ నుంచి మద్నూర్‌కు రానుంది. దీంతో మండల వాసులకు ఉపయోగకరంగా మారిందని హర్షం వ్యక్తం చేశారు.

కొబ్బరికాయలు కొట్టి ప్రారంభం

బోధన్ డిపో నుంచి వచ్చిన బస్సును సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో సర్పంచ్ సురేష్, ఉప సర్పంచ్ విట్టల్, బిఆర్ఎస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శి కుశాల్ గ్రామస్తులు కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి బస్ సర్వీస్‌ను ప్రారంభించారు. బోధన్ డిపో ఆధ్వర్యంలో బస్సు సర్వీస్ ప్రారంభించడం పట్ల వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

చెరువు వద్ద మెట్ల నిర్మాణం



మెట్లనిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలోని కుడి చెరువు వద్ద మెట్ల నిర్మాణం కట్టడానికి భూమి పూజను మంగళవారం ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అంజలి మాట్లాడుతూ దోమకొండ గ్రామం లోని కుడి చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు మెట్లు లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడేవారని, వారి కోరిక మేరకు దోమకొండ గడికోట వారసులు కామినేని అనిల్ శోభ సహకారంతో రూ.7.80 లక్షల రూపాయలతో పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ఇరిగేషన్ డివిజన్ అధికారిని అర్చన ఇచ్చిన మెట్ల మ్యాప్ ప్రకారంగానే వాటిని నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దోమకొండ జడ్పిటిసి తీగల తిరుమల గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద నాగరాజు, ఉప సర్పంచ్ గజవాడ శ్రీకాంత్, సొసైటీ చైర్మన్ పన్యాల నాగరాజు రెడ్డి, శివరాం మందిర్ ఆలయ అధ్యక్షులు అబ్రబోయిన రాజు, వార్డు మెంబర్ బొమ్మల శ్రీను వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం



కంటివెలుగును ప్రారంభిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని కన్నాపూర్ లో మంగళవారం ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికి కంటి చూపు బాగుండాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారని, కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుషాంగి రాజనర్సు, వైస్ ఎంపీపీ ముత్తినేని రవీందర్రావు, ఉప సర్పంచ్ అంజిల్ రెడ్డి, వైద్యులు చైతన్య, సురేష్, ఏఎన్ఎం జ్యోతి, సిబ్బంది భీం, ఆశా వర్కర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ కార్డుల పంపిణీ



సభ్యత్వ కార్డులు అందజేస్తున్న గ్రామకమిటీ అధ్యక్షులు

నవతెలంగాణ-గాంధారి/తాడ్వాయి

కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ కార్డులను మండలంలోని అన్ని గ్రామాల బూత్ ఎన్‌రోలర్‌లకు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులకు పంపిణీ మంగళవారం పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్డెపల్లి సుభాశ్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లైన్ రమేష్, మదర్, బద్దం వెంకట్ రెడ్డి, మోహన్ నాయక్, సంగెం రాజు, జస్వంత్ గౌడ్, అల్తాఫ్, వెంకటరమణారెడ్డి, సీతారాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి:కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి కోరారు. తాడ్వాయి మండల కేంద్రంలో మంగళవారం ఆయన కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులకు కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్డులను అందించారు గ్రామాల అధ్యక్షులు చురుకుగా పనిచేసి సభ్యత్వ నమోదును పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



బాబు మృతదేహం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామంలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మరణించిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన బాబు (40) ఉదయం తెల్లవారేసరికి మరణించి ఉన్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, గ్రామస్తులు, కులస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా హాస్పిటల్ కు తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపారు.

లిల్లీపుట్ పాఠశాలలో 8న నమూనా నవోదయ పరీక్ష

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని యోగేశ్వర కాలనీ లిల్లీపుట్ పాఠశాలలో ఈ నెల 8న శనివారం 10 గంటలకు నమూన నవోదయ పరీక్ష నిర్వహించనున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ రామగిరి దాస్ మంగళవారం తెలిపారు. ఈ పరీక్షకు హాజరుకావాలనుకునేవారు ఈ నెల 6లోపు తమ వివరాలను నమోదు చేసుకోవాలని, హాల్ టికెట్ తీసుకోని రావాలని తెలిపారు. వివరాలకు 533302816, 9502275188 అనే చరవాణి నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని నవోదయ పరీక్ష రాయబోయే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యాయవాదులకు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణబార్ అసోసియేషన్ ఎన్నికల అధికారులుగా విజయలక్ష్మి గటాడి ఆనంద్ వ్యవహరించి ఎన్నికలను సజావుగా నిర్వహించడం పట్ల నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మంగళవారం న్యాయవాదులను సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నరసం చిన్నారెడ్డి, ఉపాధ్యక్షులు జగన్, ప్రధాన కార్యదర్శి అయినారీ అశోక్, సీనియర్ న్యాయవాదులు భూపతిరెడ్డి, బద్దం జగదీశ్వర్ రెడ్డి, రుయ్యాడి రాజేశ్వర్, వెల్మ జగదీశ్వర్ రెడ్డి, ఆవుల అశోక్, చిలుక కిష్టయ్య, బేతు జగదీష్, కృష్ణ నెహ్రూ, సురేష్ కుమార్, చిలుక కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి జరగని ఊరు లేదు

- ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

ఆర్మూర్ నియోజకవర్గంలో అభివృద్ధి జరగని పల్లె లేదని, సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. "నమస్తే నవనాథ పురం" కార్యక్రమానికి కొనసాగింపుగా 'నమస్తే చేపూర్ ....మీ కోసం మీ జీవన్ రెడ్డి" కార్యక్రమం మండలంలోని చేపూర్‌లో మంగళవారం నిర్వహించారు. జీవన్‌రెడ్డికి గ్రామస్తులు మేళతాళాలతో స్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులు పట్టి జీవన్ రెడ్డి నుదుట తిలకం దిద్ది పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. జీవన్ రెడ్డి ప్రజలతో కలిసి గ్రామంలో తిరుగుతూ ప్రతి ఒక్కరినీ పలకరించి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం జరిగిన భారీ సభలో జీవన్ రెడ్డి ప్రసంగించారు. ప్రగతి పథంలో ఆర్మూర్ పేరును చరిత్రలోనే చెరగని పేజీలా సువర్ణాక్షరాలతో లిఖిస్తాఅని


ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

తెలిపారు. తెలంగాణ వస్తే ఏమొస్తదని చేపూర్ చౌరస్తాలో నిలబడి కారుకూతలు కూసిబా సన్నాసులకు చేపూర్ గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమమే ధీటైన సమాధానం అని అన్నారు. చేపూర్ గ్రామమంటే తనకు సెంటిమెంట్ అని, అభివృద్ధి పనులతో చేపూర్ రూపురేఖలే మారిపోయాయని తెలిపారు. ఇప్పటివరకు గ్రామంలో ఎంతమందికి ప్రభుత్వ పథకాలద్వారా ఎన్ని డబ్బులు అందించారో ఆయన వివరించారు. చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రజలకు తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం 184 దరఖాస్తులు వచ్చాయని, త్వరలోనే మంజూరు చేయిస్తానని తెలిపారు. స్థలం ఉన్నవారు ఇండ్లు కట్టుకునేందుకు 3లక్షల రూపాయల చొప్పున ఇప్పిస్తానని చెప్పారు. తాను చెప్పినవన్నీ నిజాలేనని నమ్మితే గట్టిగా చప్పట్లు కొట్టాలన్నారు. జై బీఆర్ఎస్ అని నినాదాలు చేస్తూ చప్పట్లు కొడితే కాంగ్రెస్, బీజేపీల దిమ్మదిరిగాలని, మోడీ మైండ్ బ్లాంక్ కావాలని జీవన్ రెడ్డి అన్నప్పుడు గ్రామస్తులంతా కొట్టిన చప్పట్లతో చేపూర్ మారుమోగింది. బీజేపీ, కాంగ్రెస్‌లకు ఎప్పుడూ ఓట్లు, నోట్ల గొడవేనని, ప్రజా సంక్షేమం పట్టదని ఆయన ధ్వజమెత్తారు. ప్రజలు కాంగ్రెస్, బీజేపీ నేతల మాయలో పడొద్దన్నారు. ఎంపీ అరవింద్ నయవంచకుడని, బీజేపీ ఒక విషవలయమని, కాంగ్రెస్ అవినీతికి నిలయమని విమర్శించారు. ప్రజల ఆశీస్సులతో హ్యాట్రిక్ విజయం సాధిస్తానని ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మండల అధికారులతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ పస్కా నర్సయ్య, జడ్పీటీసీ సంతోష్, సర్పంచ్ ఇందూరు సాయన్న, ఎంపీటీసీ బాల నర్సయ్య, ఉప సర్పంచ్ శ్రీనివాస్ , వీడీసీ అధ్యక్షుడు రిక్కలా రాజారెడ్డి, మాజీ ఎంపీటీసీ జన్నపల్లి గంగాధర్, బీఆర్ ఎస్వీ నాయకులు షాహిద్, గంగాధర్ , నాగరాజు బీఆర్ఎస్ నాయకులు సిందుకర్ చరణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

అసైన్డ్ భూమిని పేదలకు పంచాలి

మల్కాపూర్‌వాసుల ధర్నా


మాట్లాడుతున్న భూపతిరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్కాపూర్ గ్రామంలో సర్వే నెంబరు 339 అసైన్‌మెంట్ భూమిని పేదలకు పంచాలని 16 రోజుల నుండి నిరవధిక ధర్నా చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ భూపతిరెడ్డి మంగళవారం వారికి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కచ్చితంగా ఈ భూమిని పేదలకు పంచుతామని హామీనిచ్చారు. అంతేకాకుండా ఈ పోరాటానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అసైన్డ్ భూమి సాధన కమిటీ అధ్యక్షులు పీట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కూతురు మల్లేష్. ప్రధాన కార్యదర్శి శ్వేత, మాజీ సర్పంచ్ దాసు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

వితంతు పింఛన్ల పంపిణీ


పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ

నవతెలంగాణ-వర్ని

చందూర్ మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో సర్పంచ్ సత్యనారాయణ వితంతువులకు పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వితంతువులకు, వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్లను అందజేస్తూ అండగా ఉందన్నారు. నీరడి ఎల్లవ్వ,,కమ్మరి లక్ష్మి,, ముక్కెరి పెద్ద ఓడ్డెవ్వ,,బోడ్డోల్ల లక్ష్మి, పాత్లోత్ నాజిబాయికి కొత్తగా వచ్చిన పెన్షన్లను ఆయన అందించారు. పెన్షన్ వస్తూ చనిపోయిన భర్తల స్థానంలో భార్యలకు రావడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీమతి శ్రీ కోటగిరి అశ్విని సాయిలు, పార్టీ ప్రెసిడెంట్ రాములు,డీలర్ నర్సింలు, పర్షన్ ఎర్రన్న, చింతం రవి, ముక్కెర శ్రీను, నరెడ్ల సాయిలు, పాల్దేనారాయణ, శికారి సాయికుమార్, లింగయ్య హైమద్, ఖాజా,గోల్ల శ్రీను, ముక్కెర రాము, లబ్ధి దారులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులు ఐక్యంగా ఉండాలి

- ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్


బాజిరెడ్డి జగన్‌ను సన్మానిస్తున్న మున్నూరుకాపు సభ్యులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మున్నూరు కాపులు ఐక్యంగా ఉండి రాజకీయంగా ఎదగాలని, మున్నూరు కాపు వసతి గృహాల ఏర్పాటుకు కృషి చేయాలని, వసతి గృహాల ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానని, విద్యారంగంలో మున్నూరు కాపు బిడ్డలకు ఆర్థిక సహాయం అందించినందుకు ఉన్నత స్థాయిలో ఉన్న మున్నూరు కాపులు ముందుకు రావాలని ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పిలుపు నిచ్చారు. నిజామాబాద్ జిల్లా మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం డిచ్‌పల్లి మండలంలోని బర్ధిపూర్ గ్రామ శివారులోని బృందావన్ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిఎస్‌ఆర్టిసి చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొని మాట్లాడుతూ.. మున్నూరు కాపు జిల్లా అధ్యక్షుడిగా జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యులు, ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పీటిసి బాజిరెడ్డి జగన్ మోహన్‌ను జిల్లా మున్నూరు కాపులు ఏకమై ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. మున్నూరు కాపులు ఐక్యమత్యంగా ఉండి రాజకీయంగా ఎదగాలని పిలుపునిచ్చారు. మున్నూరు కాపులు ఆర్థిక, రాజకీయ వ్యాపారంలో ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవన్న, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ ఆకుల లలిత, ఉమ్మడి జిల్లాల డిసిఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, జిల్లా మున్నూరు కాపు నాయకులు పాల్గొన్నారు.

అంధత్వంలేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- ఎడపల్లి ఎంపీపీ శ్రీనివాస్


మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

నవతెలంగాణ-ఎడపల్లి

తెలంగాణ రాష్ట్రాన్ని అంధత్వంలేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే సీఎం కేసీఆర్ లక్ష్యంఅని ఎంపీపీ కే శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఏఆర్‌పి క్యాంప్ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని మంగళవారం ఎంపీపీ కే శ్రీనివాస్ సందర్శించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ.. రెండో విడత కంటి వెలుగు పథకాన్ని అమలు చేసి ఎంతోమంది కంటి చూపుతో బాధపడుతున్న వారికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేయించడం హర్షనీయమని తెలిపారు. మండలంలో 3వేల మందికి పైగా కంటి వెలుగు పథకంలో పరీక్షలు చేసుకుని కంటి అద్దాలు తీసుకున్నారని అన్నారు. దగ్గర, దూరం చూపుతోతో పాటు కంటితో ఇబ్బందులు పడుతున్న ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎడపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్య అధికారి రాజ్ కుమార్, సర్పంచ్ అలేఖ్య మహేష్ గౌడ్, అంగన్వాడి ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

135మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ ఆరోగ్య కేంద్రం హౌసింగ్ బోర్డ్ ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా సుమారు 135 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సమస్యలు గల వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నలుగురు మహిళలను జిల్లా ఆస్పత్రికి రిఫరల్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రమేష్ మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ ఆయేషా డాక్టర్ మానస పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో
చెలగాటమాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం

- పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు నరేందర్
- విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-ఆర్మూర్ /కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్రంలో భద్రత లేని పరీక్షలు నిర్వహించి విద్యారులు, నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్షులు ఎం నరేందర్ అన్నారు. పదవ తరగతి పరీక్ష ప్రశ్నా పత్రాల లీకేజీ పై రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించి వెంటనే విద్యాశాఖ మంత్రిని భర్తరఫ్ చేయాలని పరీక్ష ప్రశ్న పత్రాలను లీకే చేసిన వారిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మను మంగళవారం అంబేద్కర్ చౌరస్తా దగ్గర దగ్ధం చేశారు. ఈసందర్భంగా నరేందర్, నిఖిల్ యువజన సంఘం కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం మూలానే వికారాబాద్ జిల్లా తాండూర్, వరంగల్ జిల్లాలో పరీక్ష సెంటర్ లో 10 వ తరగతి పరీక్ష పేపర్ లీకేజీ జరిగిందని అన్నారు. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సొంత జిల్లాలో ప్రశ్నాపత్రం బయటకు వచ్చిందనే ఆరోపణలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. రెండవ రోజు హిందీ పరీక్ష ప్రశ్నాపత్రాన్ని వరంగల్ జిల్లాలో లీక్ చేశారని వారన్నారు. పరీక్షలు ప్రారంభం అయి 10 నిముషాలు కూడా కాకుండానే బయటుం రావడం అంటే ఉద్దేశ పూర్వకంగానే లీక్ చేశారనే అనుమానం వ్యక్తం అవుతుందన్నారు. వాట్సాప్ గ్రూపులో చక్కర్లు కొట్టడం వంటివి ఉద్దేశ పూర్వకంగా జరిగినట్టు సందేహాలు కలుగుతున్నాయని ఆరోపించారు. దీనికి విద్యాశాఖ మంత్రి బాధ్యత వహించి రాజీనామా చేయాలనీ వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జ్ తో న్యాయ విచారణ జరిపించాలని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్, యువజన సంఘంనాయకులు మనోజ్, నజీర్, నాయకులు వంశీ సిద్ధార్థ, తదితరులు పాల్గొన్నారు.


విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పేపర్ లీకేజీలపై విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

- ఏఐఎస్బి రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మహేష్ రెడ్డి

కంఠేశ్వర్:రాష్ట్ర ప్రభుత్వం పరీక్ష పేపర్లను ఇష్టానుసారం లీక్ చేస్తూ విద్యార్థుల భవిష్యత్తులను అంధకారం చేస్తుందని ఏఐఎస్బి రాష్ట్రవైస్ ప్రెసిడెంట్ మహేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యతో పాటు ఉద్యోగాలను కూడా అమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్న టిఎస్పిఎస్సి పేపర్ లీక్, నిన్న వికారాబాద్ జిల్లాలోని తాండూర్ పాఠశాలలో టెన్త్ పేపరు లీక్ అవ్వడం, అదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరు పాఠశాలలో జవాబు పత్రాల బండిల్స్ జారిపోవడం వంటివి పటిష్ట భద్రత లేకపోవడమేనని పేర్కొన్నారు. ప్రశ్న పత్రాలను లీక్ చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరీక్షా పత్రాల లీకేజ్‌పై ఎవరి హస్తముందో ప్రభుత్వం అధికారులు తెలుసుకొని మీడియా ముందు హాజరు పరచాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వాటివల్ల మంచిగా చదివే విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీకి తరలిన నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న జరిగే మజ్దూర్ కిసాన్ సంఘర్ష ర్యాలీ సభకు రైతు సంఘం , సిఐటియు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సోమవారం రాత్రి జిల్లా కేంద్రం నుండి తరలివెళ్లారు. అనంతరం తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు శంకర్ గౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వేషాల గంగాధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు పెంచుతూ పెట్టుబడిదారులకు రాయితీలు ఇస్తూ ఆదాని అంబానీల కోసం చట్టాలను సవరించడం చేస్తోందని అన్నారు. అంబానీ ఆస్తులు పెంచడానికి కార్మిక చట్టాలను సవరించడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలిపారు. పేద ప్రజలకు సబ్సిడీ కోతలు పెట్టకుండా రాయితీలు ఇవ్వాలని రైతులకు ఎరువులు విత్తనాలు కల్తీ లేకుండా సబ్సిడీలు ఇవ్వాలని ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని అన్నారు. మెడిసిన్ ధరలు, టోల్ ధరలు పెంచడం, సిమెంటు ధరలు పెంచడం సిగ్గుచేటని అన్నారు. కార్మికులకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐపీఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేయాలని అన్నారు లేనియెడల రాబోయే ఎన్నికల్లో కార్మిక కర్షకులు అంతా మోడీ ప్రభుత్వాన్ని గద్ద దింపటం ఖాయమని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జె సుజాత, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తోగటి భువనేశ్వర్, కార్మిక సంఘం నాయకులు లక్ష్మణ్, శ్వేతా శ్రావణ్ కుమార్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీకి తరలివెళ్లిన నాయకులు

స్వార్థ ప్రయోజనాల కోసం
ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దు


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నవీపేట్

తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఎస్సీ ఎస్టీ చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు శివప్రసాద్ అన్నారు. మండలంలోని రాంపూర్ గ్రామ సర్పంచ్ భర్త, సొసైటీ వైస్ చైర్మన్ దొంత ప్రవీణ్ తన స్వార్థ ప్రయోజనాల కోసం ఎస్సీ సర్టిఫికెట్‌తో రాజకీయ పదవులే కాక ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందడమే కాక పేదవర్గాలపై అక్రమంగా అట్రాసిటీ కేసులో నమోదు చేయడం పట్ల జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ కి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ పార్టీ ముస్లిం క్రైస్తవులకు వ్యతిరేకం కాదని అంబేద్కర్ రచించిన రాజ్యాంగం క్షేత్రస్థాయిలో అమలు జరిపేందుకే తమ ప్రయత్నమని అన్నారు. ఎల్కే ఫారం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ కేవలం దొంత దౌర్జన్యాలపై మాత్రమే మాట్లాడారని, కానీ బీఆర్ఎస్ నాయకులు ఒక తప్పుడు వ్యక్తి కోసం అవగాహన లేకుండా హిందుత్వం, బిజెపి పార్టీ గురించి మాట్లాడి వ్యవస్థలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని తెలిపారు. అవసరమైతే బిఆర్ఎస్ నాయకులు కౌన్సిలింగ్ తీసుకోవాలని సలహా ఇచ్చారు. కార్యక్రమంలో రాజశేఖర్, సుధీర్ విజయ్, బందెల ఆనంద్, వంశీ మోహన్, పుట్ట శ్రీనివాస్ గౌడ్, నాగభూషణం బాధితులు రామకృష్ణ, గౌతం, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో
50శాతం సబ్సిడీతో గ్యాస్‌సిలెండర్ ఇవ్వాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

12 రకాల సరుకులు ఇవ్వాలని, గ్యాస్ సబ్సిడీలు ఇవ్వాలని, నూతన రేషన్ కార్డులను ఇవ్వాలని, తదితర డిమాండ్లతో ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు), ప్రగతిశీల యువజన సంఘం (బీఓవైఎల్) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్.ఆర్. భవన్ లో పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కామ్రేడ్ వి, గోదావరి, అల్గోట్ సంధ్య, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షులు బట్టు కిషన్ లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జిల్లాలో ఉన్నటువంటి షాపుల్లో 12 రకాల నిత్యవసర సరుకులు, అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజలపై పన్నుల భారం మోపుతున్నారని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం బియ్యం మాత్రమే ఐదు కేజీల పంపిణీ చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఐదు కేజీలు, కేంద్ర ప్రభుత్వం 5 కేజీలు మొత్తం పది కేజీల నాణ్యమైన సన్న బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీడుతో పాటు వంట నూనె, కందిపప్పు, పెసరపప్పు, గోధుమపిండి, పంచదార, టీ పొడి, ఉప్పు, పసుపు, కారం, చింతపండు, పల్లీలు, సరుపు, సబ్బు లు ప్రజా పంపిణీ వ్యవస్థ రేషన్ షాపుల ద్వారా పేద మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి సబ్సిడీ ఎత్తివేస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కార్పోరేటర్ల అనుకూల నిర్ణయమని అన్నారు. ప్రజలు నిలువునా దోపిడీ చేసి నరేంద్ర మోడీ ఆదాని, అంబానీ లకు, ఈ దేశాన్ని కట్టబెడుతున్నారని, ఈ దేశాన్ని అప్పుల దేశంగా మార్చి, పెద్ద పెద్ద కార్పొరేట్ వ్యక్తులకు సబ్సిడీ ఇస్తున్నారు, గాని పేద మధ్యతరగతి కుటుంబాలకు రావాల్సిన రాయితీలను ఎత్తివేసి బ్యాంకులు కూడా పేద మధ్యతరకులను పీడిస్తున్నాయని, ఇదే పద్ధతి కొనసాగిస్తే రానున్న ఎలక్షన్లలో నరేంద్ర మోడీని గద్దె దించుతారని భరత ప్రజానీకం వారికి సరైన బుద్ధి చెబుతుందని అన్నారు. మహిళలు అని రంగంలో ముందుండి మన పైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేస్తున్న భారాన్ని ప్రశ్నించి అందరూ ఉద్యమాల బాటపట్టాలని, యువకులు చైతన్యపరులు, మేదో శక్తితో ఆలోచించి, ఈ ప్రభుత్వం చేస్తున్నటువంటి ప్రజా వ్యతిరేక విధానాలను ఎత్తిచూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు భారతీ, మహిళ సంఘం నాయకులు నర్సక్క, సునంద, కీర్తన, రాజమణి, వాణి, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

9న ముదిరాజ్ ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా ముదిరాజ్ ప్రభుత్వ ఉద్యోగుల కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిజామాబాదులో ఈనెల 9న ఉంటుందని ప్రభుత్వ ఉద్యోగుల విభాగం, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు గోవర్ధన్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి సాయిబాబా ముదిరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి తెలంగాణా రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉద్యోగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులు వస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని ముదిరాజ్ ప్రభుత్వ, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అందరు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమం నిజామాబాద్ నగరంలోని ముదిరాజ్ వీధి పోచమ్మ గల్లి ఏరియా ముదిరాజ్ భవన్‌లో ఉంటుందని పేర్కొన్నారు. ముదిరాజ్ ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రెండవ రోజు పది పరీక్షలు ప్రశాంతం

నవతెలంగాణ-ఎడపల్లి

ద్వితీయ భాష హిందీ పరీక్షకు మండలంలోని జానకంపేట్‌లో ఒక పరీక్ష కేంద్రం, ఎడపల్లి లో రెండు పరీక్ష కేంద్రాలు ఉన్నట్లు పరీక్షల చీఫ్ సూపర్డెంట్లు తెలిపారు. 411 మంది విద్యార్థుల గాను 404 మంది విద్యార్థులు హాజరుకాగా ఏడు విద్యార్థులు గైర్హాజరైనట్లు సూపరింటెండ్లు తెలిపారు. పోలీసులు పరీక్షల కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్నారు.

పాఠశాలల్లో ఫైలేరియా లింఫాటిక్ సర్వే

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కమ్మర్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో, చౌట్ పల్లిలో గీతాంజలి పాఠశాలలో మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఫైలేరియా లింఫాటిక్ సర్వే నిర్వహించారు. మొదటి, రెండవ తరగతి చదువుతున్న పిల్లలకు రక్త పరీక్షలు నిర్వహించారు. కమ్మర్‌పల్లిలో 35 మంది, చౌట్ పల్లిలో 28 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. వీరందరికీ నెగిటివ్‌గా వచ్చినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఫైలేరియా లింఫాటిక్ సర్వేను మండల వైద్యాధికారి నరసింహ స్వామి పరిశీలించి సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయన్న, డాక్టర్ సుప్రియ, హెచ్ఈఓ మహేందర్, సత్యనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్, హెల్త్ అసిస్టెంట్ పండరి, మోహన్, ఏఎన్ఎం శ్యామల, కృష్ణవేణి, సాయమ్మ, చౌట్ పల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమాదేవి, ఉపాధ్యాయులు రాజేశ్వర్, లాస్య, అనూష, భావన, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్